
రెండు టికెట్లు
హితశ్రీ

సర్క్యూట్ ఎక్స్‌ప్రెస్ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ దగ్గిర నిలబడి శంకర్ అత్రుతతో ప్లాట్‌ఫారం ఎంట్రెన్స్‌వైపే దృష్టి సారించి చూస్తున్నాడు.

వసంత జాడలేదు.

శంకర్ విసుగ్గా వాచ్ చూసుకున్నాడు. మరో పదిహేనునిమిషాలలో ట్రెయిన్ కదులుతుంది. అసలు వసంత వస్తుందా? తన అంచనా ప్రకారం ఆమె తెగింపు గలదే, కాని చివరికి మనసుమారుస్తుందా? లేక, ఏమైనా అడ్డంకి ఎదురయిందా? ఒక వేళ రహస్యం బయటకు పొక్కిందా? శంకర్‌కి ఆలోచన తోచడంలేదు. మాటి మాటికీ వాచీ వైపూ, ప్లాట్‌ఫారం ఎంట్రెన్స్‌వైపూ చూడసాగాడు.

మెరుపు మెరిసినట్లయింది.

అతనికళ్ళు జిగేలుమన్నాయి.

అదిగో, వసంత!

అతని మనసు పరవశించింది. మూర్తీభవించిన సౌందర్యంలా వసంత మెల్ల మెల్లగా ట్రెయిన్‌వైపు వస్తోంది. ఆ అందమైన కళ్ళు ఎవరికోసమో వెతుకుతున్నాయి. శంకర్ వదనం ప్రఫుల్లమైంది. ఇదుగో. ఇక్కడ, నువ్వు వెతుకుతున్న భాగ్యశాలి టెరిలిన్ సూట్‌లో ఫస్ట్‌క్లాసు కంపార్ట్‌మెంట్ ముందు నిలబడివున్నాడు. అతని జేబులో మద్రాసుకి రెండు ఫస్టు క్లాసు టిక్కట్టులున్నాయి. అవి మొదటి తరగతి జీవితానికి ప్యాస్‌పోర్టులు. మధుర ఘట్టాలకి నాందీ ప్రస్తావనలు. మరో ప్రపంచ దృశ్యాల ప్రొజెక్టర్లు. ఆనందమయ వైవాహిక జీవితానికి ఆహ్వానాలు. శంకర్ చిరునవ్వుతో చెయ్యెత్తాడు. వసంత కళ్లు మిలమిల మెరిశాయి. అదుగో శంకర్. నిర్మలమైన మనసుకి చిహ్నంగ తెల్లని సూట్‌లో చల్లని వెన్నెలలు కుమ్మరించే చంద్రుడిలా! ఏదో తెలియని ఆనందంతో ఆమె మనసు ఉక్కిరి బిక్కిరౌతుంది.

శంకర్ తనకి తెలియకుండానే రెండడుగులు ముందుకి వేశాడు. దూరంనించే ఆమె అతని కళ్ళల్లోకి చూసింది.

ఇదిగో శంకర్ నీ వసంత. నీ ఛాతకం నీ జాతక చక్రం. నీ తోటలో గులాబి. నీ కళ్ళలో తళుకు.

"అమ్మయ్య, వచ్చావుగద!"

"రాననుకున్నారా?"

"ఏ పానకంలోపుడక అడ్డుతగుల్తుందోనని భయం."

"స్నేహితురాలింటికి పుస్తకాలకోసం వెడుతున్నానని వచ్చాను. సూట్‌కేస్ తెస్తే బాగుండేదికాని, వీలుకాలేదు."

శంకర్ ఆమె చేతిలోని హాండ్‌బ్యాగ్ వైపూ, పుస్తకాలవైపూ చూశాడు.

"సూట్‌కేసులు మద్రాసులో చాలా ఉంటాయి."

వసంత నవ్వింది.

"మీ సూట్‌కేసు నాకిచ్చేసి మీరు కొత్తది కొనుక్కోండి."

"అప్పుడే దురాక్రమణ మొదలా?"

ఇద్దరూ నవ్వారు. శంకర్ కంపార్ట్‌మెంటులోకి దారితీశాడు. వసంత అతన్ని అనుసరించి హాండ్‌బ్యాగ్ పుస్తకాలు బెర్త్ మీద పడేసి, బెర్త్ మధ్యగా వున్న నీలి రంగు సూట్‌కేస్‌పక్కకిజరిపి కూర్చుంది. శంకర్ కూర్చోకుండా వాచ్ చూసుకున్నాడు.

"ఇంకా టైముంది. ఏవైనా మాగజైన్సు కొనుక్కు వస్తా, వసంతా."

శంకర్ చప్పున హిగిన్‌బాదమ్స్ బుక్ స్టాలువైపు నడిచాడు. వసంతకిటికీ లోంచి అతనివైపు కాసేపు ఆప్యాయంగా చూసి, అతను జనంలో కలిసిపోయింతర్వాత, కంపార్ట్‌మెంట్ అంతా కలయజూసింది. తను తప్ప ఇంకెవరూ లేరు. మద్రాసు చేరేదాకా ఆ పెట్టెలో ఎవరూ ఎక్కకుండా ఉంటే బాగుండును అనుకొంది. మనసారా ప్రేమించిన శంకర్‌తో నూతన జీవితంలోకి ప్రయాణం చేయబోతోంది. మనసంతా ప్రయాణంతో నిండింది. కానీ ఏదో అందోళన, తెలియని దిగులు ఆమెని ఆవరించాయి. అందర్నీకాదని వచ్చేస్తుంది. శంకర్‌తో తన వివాహం ఎవరూ ఆమోదించలేదు. అతను విద్యాధికుడైనా, మంచి ఉద్యోగంలో ఉన్నా, స్థితిమంతుడైనా తన కులంకాదు. ఉత్తమ సంస్కారం కావాలి గాని కులమెందుకు! కాని అందరూ అలా అనుకోరు. తప్పనిసరిగా అందరినీ ధిక్కరించి అతనితో మద్రాసు వెడుతోంది. వెళ్ళగానే రిజిస్టరుమ్యారేజి ఐపోతుంది. మద్రాసులోనే అతని ఉద్యోగం. అక్కడే స్థిరపడిపోవాలి. ఈ ప్రాంతాలకి మళ్ళీ రావటం బహుశా జరగదు. జరిగింది మర్చిపోయి అందరూ తనను క్షమిస్తారనే ఆశ లేదు.

వసంతకి ఏదో బలహీనత ఆవరించినట్టయింది. మనసులో సంతోషమూ, అస్పష్టమైన భయమూపోటీపడుతున్నాయి. తను తొందరపడుతున్నదేమో! ఆలోచించిన కొద్దీ ఏదో నిరుత్సాహం.

ఆమె ఆలోచించటం మానేసింది, పక్కన ఉన్న పుస్తకాలు తిరగేసింది. అవి చదివినవే. పోస్టులో మాధవికి పంపేయ్యాలి. సూట్‌కేస్‌లో ఏమైనా పుస్తకాలున్నాయేమో!

వసంత బెర్త్‌మీది నీలం సూట్‌కేస్ వైపు చూసింది. దగ్గరగా వెళ్ళింది, ఇక నించీ దాని మీద తనికీ హక్కుంది. ఆ ఆలోచనకి ఆమె హృదయం స్పందించింది మనసులో శంకర్ అనురాగంతో అవును అనట్టు తల ఊపాడు. ఏదో పుస్తకం అడ్డుండటం వల్ల పెట్టె ఓరగా తెరిచి ఉంది. వసంత పెట్టె తీసింది. ఏదో పుస్తకాలున్నాయి. ఓ పుస్తకం తీసింది. ఏదో ఇంగ్లీషు నవల. పెట్టెమూసి, తన స్థానంలో కూర్చుని పుస్తకం తిరగేసింది.

వసంతకి షాక్ తగిలి నట్టయింది. పుస్తకం పేజీలు మధ్య ఓ అందమైన


యువతి ఫోటో ఆమె వైపు వ్యంగ్యంగా చూసింది.

వసంతకి ముచ్చెమటలు పోశాయి.

ఎవరిది ఆ ఫోటో? ఎంత అందం! శంకర్ ఆ ఫోటో పుస్తకంలో ఎందుకు పెట్టాడు? అతనికి తోబుట్టువులు ఎవరూ లేరు. స్నేహితురాలై ఉండాలి. స్నేహితురాలేనా. లేక? ఆ పైన ఊహించటానికి ఆమెకి మనస్కరించలేదు. కాని ఎదురుగా ఫొటోలోంచి ఆమె ఎవరో తన వైపు గేలిగా చూస్తున్నట్టుంది. ఒక వేళ శంకర్ ఆమెని ప్రేమించాడా? ఈ ఊహ తట్టగానే ఆమెకి నవనాడులూ కుంగి నట్టయింది. శంకర్ మోసగాడా? అతని ముఖంలోకి చూస్తే అమాయికత తప్ప మరేమీ కనిపించదు, అసంభవం. అతను తనని మోసగించ జాలడు. ఆ కళ్ళలోని నిజాయితీ తను అర్థం చేసుకో గలదు, మరి ఈ ఫోటో ఏమిటి? ఆమె ఎవరో శంకర్ని ప్రేమించిందేమో! తన ఆకర్షణ బలీయమై శంకర్ ఆమెని తిరస్కరించి ఉండవచ్చు. ఈ ఆలోచన రాగానే ఆమె మనసులో మామూల గర్వం తొంగి చూసింది. కాని వెంటనే ఆమెకో సందేహం కలిగింది. అతనామెని తిరస్కరిస్తే ఫోటో పుస్తకంలోపెట్టి ఎందుకు తెస్తాడు బహూశా, ఆ ఫోటో విషయం మర్చిపోయాడేమో లేకపోతే అది తిరిగి పంపే ఉద్దేశంతో తెస్తున్నాడేమో! అంతే ఐ ఉంటుంది అంతేనా?

వసంత మనసు సరిపెట్టుకో లేక పోతోంది. తన కర్తవ్యం ఏమిటి? అతన్ని అడిగేస్తే? చిన్న బుచ్చుకుంటాడేమో! ఆ మాత్రం తనపట్ల నమ్మకం లేకపోయిందని నొచ్చుకుంటాడేమో! ఏం చేయాలి? ఈ విషయం తేలేదాకా తన ప్రయాణం మానుకుంటే!

వసంతకేమీ పాలుపోటంలేదు. ఎదురుగా ఫోటో తన వైపు అపహాస్యంగా చూస్తున్నట్టుంటే, భరించలేక పుస్తకం మూసేసి బెర్తుమీద పడేసింది. శంకర్ని అడిగితే మాత్రం అతను నిజం చెప్తాడని నమ్మకం ఏమిటి? ఆ కళ్ళలో కనిపించేది నిజమైన అనురాగమేనా! లేక తెచ్చి పెట్టుకొన్న ప్రేమా? నటిస్తున్న అమాయికతా?



భగవాన్,ఇదేమిటి అడుగులో హంసపాదు? తనుఇంత చదువుకునీ గుడ్డిగా అతని వెంట వచ్చేస్తోంది. అతను తనని నట్టేట్లో ముంచడని నమ్మకం ఏమిటి? శంకర్, శంకర్!! వసంత అప్రయత్నంగా లేచి నిలబడ్డది. తలుపు వైపు రెండడుగులు వేసింది. తను శీఘ్రం అక్కడినించి పారిపోవాలి. ఇంటికి తిరిగిపోవాలి!

వసంత తలుపు దగ్గరికి చేరి కమ్మీ పట్టుకుని దిగ బోయింది. చెయ్యి మీద చెయి పడ్డది. ఆమె బెదురుగా తలెత్తి చూసింది,

చిరునవ్వు వెన్నెలలో కురిపిస్తూ శంకర్!

చ.......ఆ వదనంలో కాపట్యానికి చోటేదీ?

ఏమిటి వసంతా నేను పారిపోయానను కున్నావా? నన్ను వెతకటానికేనా దిగుతున్నావు! నేను నీ శంకర్ని. పదపద, ప్లాట్‌పారం మీద షికార్లు చేస్తుంటే. ఎవరైనా చూసేరు!''

శంకర్ ఓ చేత్తో పత్రికలన బొత్తిగా పట్టుకొని రెండో చేత్తో ఆమెని లోపలికి తోశాడు. వసంత అతని వైపే చూస్తే యాంత్రికంగా మళ్లీ బెర్తుమీద కూలబడ్డది.

''ఇవిగో తెలుగు ఇంగ్లీషు, హిందీ, తమిళ పత్రికలు అన్నట్టు నీకు అరవం రాదు కదూ, వచ్చేస్తుందిలే— కొన్నాళ్లు. నేను అరవం మాట్లాడితేతెలుగు వాడినని ఎవరూ అనుకోరు.'' అతనేమేమిటో అంటున్నాడు. వసంతకి ఏమీ వినిపించటంలేదు. అలాగే అతని కళ్ళలోకి సెర్చిలైట్ వేసి చూస్తున్నట్టు చూడసాగింది. ఆమె వైఖరికి అతనికి కొంచెం ఆశ్చర్యం కలిగింది.

'ఏమిటి వసంతా అలా మూగదానిలా చూస్తున్నావు? అప్పుడే ఇంటి మీద బెంగా?''

అతను నవ్వాడు. వసంత నవ్వలేదు. అతన్ని ఆ ఫొటో సంగతి అడిగేస్తే? పెదవులదాకా వచ్చిన ప్రశ్నని ఆమె పెదవుల మధ్య నొక్కి వేసింది. ఎందుకో అడగా లనిపించటంలేదు. ఊహూఁ— తను అడగలేదు అడగదు ఏమైనాకానీ!

''మంచి పిల్లవికాని కాసేపు ఈ పత్రికలు తిరగెయ్యి. ఆలోచిస్తుంటే అన్నీ సమస్యలుగా తయారౌతాయి. రైలు దూకి పారిపోయినా పారిపోతావు!''

బలవంతంగా అతను పత్రికలని ఆమె చేతిలో పెట్టాడు, ఆమె చిన్నగా నవ్వింది ఏదో పత్రిక తీసి పేజీలు తిప్పసాగింది.

బెర్తుమీది ఇంగ్లీషు నవల శంకర్ దృష్టికి ఆకర్షించింది. చేతిలోకి తీసుకున్నాడు. గంట మోగింది. ఇంజన్‌కూత వేసింది.

పేజీలు తిప్పుతున్న శంకర్ ముఖకవళికలు అకస్మాత్తుగా మారాయి తలెత్తి వసంత వైపు దీక్షగా చూశాడు. అతనలా తన వైపు చూడటం ఆమె గమనించింది అతని చేతిలో పుస్తకం చూసింది. ఆమె గుండె గబగబ కొట్టుకోసాగింది. ఆ ఫొటో తను చూసినట్టు అతను కనిపెట్టాడు కాబోలు. అతని ముఖం అలా తెల్లబోతోందేం! అరె! ఇంతలో ఆ నుదురు మీద గీతలేమిటి? వదనం క్షణంలో ఎర్రబారిందేం! హుఁ—అతను తను అనుకున్నంత అమాయకుడేం కాదు;

''వసంతా:''

''ఊఁ—''

"ఈ ఫోటో ఏమిటి?"

వసంతకి వొళ్ళు మండింది. [ఏమి]టి ఆ ప్రశ్న? ఏమీ ఎరగనట్టు! [త]ను చెప్పాలిట.

"నేను చెప్పాలా?" అంది [ఆ]క్రోశంతో.

"మరి?"

"మీ స్నేహితురాలు." అ[నుకోన]ిది దనుకుంటూనే దురుసుగా, స్ప[ష్ట]ంగా అంది.

"షటప్." అన్నాడు శంకర్.

ఆమె తీక్షణంగా అతని [వై]పు చూసిం[ది].

"ఇంకా నేను మీ భార్యని కా[లేద]ు."

"మంచిదే. కాని ఇలా నన్ను అవ నించాలిసిన అవసర మేమిటో న[ా]కర్థం కావటం లేదు."

"అవమానమా, నేనా!" క[ఠిన]ంగా అందామె.

"మవ్వే! లేకపోతే ఆ సమ[ాధ]ానం ఏమిటి? ఇప్పటికైనా నిజంచెప్పు. [ఎ]వరిది ఈ ఫోటో?"

ఫోటో చేతిలోకి తీసుకుని ఆమె వైపు త్రిప్పాడు.

వసంత నిర్ఘాంత పోయింది.

"అలా తెల్లబోతావేం, నేను వట్టి వనికిమాలిన వాడినికానన? ఎవ[రి]ది ఈ ఫోటో?"

"నాకెలా తెలుస్తుంది?"

"నీ పుస్తకంలో ఫోటో ఎలా వచ్చిందో నీకు తెలియదు. భేష్."

"నా పుస్తకమా?" కనుబొమ[లు ము]డి చిందామె.

"అదే, నీ స్నేహితురాలి [పు]స్తకం కాబోలు. ఈ ఫోటో ఆమె అన్న[దా]? మీ ఇద్దరికీ ఆమెగారు హంసరాయభా[రం] నడి పారు కాబోలు. ఏం?"

ఛీ. ఏమిటి అతననేది: ఇతన[ు] తనెరిగిన శంకర్ కాదు. ఆ శంకర్ అ[దృ]శ్యమై ఇత నెవరో నవమి పురుషుడు తనని పీడిస్తున్నాడు.

"మాట్లాడవేం?"

"మీ అభిప్రాయం నా కర్థం కావటం లేదు."

"ఇంకా స్పష్టంగా చెప్పాలా?"

వసంతకి అసహ్యం వేసింది.

"అక్కర్లేదు. మీరేదో ప్లానుప్రకారం నడుస్తున్నట్టుగా ఉంది. ఇంత అవస్థ దేనికి. పెళ్ళి చేసుకోటం ఇష్టం లేదంటే సరిపోదా? పన్నుగడతో నామీద ఏదో నేరం మోపి తప్పించుకోవాలిసిన అవసరం లేదు. హుఁ - నేనే మిమ్మల్ని దబాయిస్తానని ఊహించి అది సాగక పోయేసరికి ఈ విధంగా కథ మార్చారా! ఛీ...."

ఆమె తటాలున లేచింది.

"ఏమిటి నీ భావం!" అన్నాడు ఈ కొత్త మలుపు అర్థంకాని శంకర్. వసంత చివాలున అతని చేతిలోంచి పుస్తకం లాగింది. పేజీలు విప్పి ఒక ఫోటో తీసి అతనికి ఎదురుగా పెట్టింది.

"ఏమిటా, ఇది!"

శంకర్ ఆశ్చర్యంగా ఆ ఫోటో వైపు చూశాడు. ఎవరా యువతి!

"ఎవరిది ఆ ఫోటో? నువ్వు చెప్పేది స్పష్టంగా చెప్పు,"

"నేను చెప్పాలా? మీ పుస్తకంలో ఫోటో సంగతి నేను చెప్పాలా?" కోపంతోచలించేపెదవులతో అందివసంత.

"నా పుస్తకమా?"

"ఉఁహుఁ - నాది?"

శంకర్ ముఖం చిట్లించాడు. అతని కంతా అయోమయంగా ఉంది.

గార్డు విజిల్ వేశాడు. రైలు [క]దల బోతోంది వసంత తలుపు వైపుకి నడిచింది. శంకర్ గుడ్లప్పగించి చూశాడు.

రైలు కదిలింది. వసంత దిగబోయింది. అదే సమయంలో ఎవరో యువకుడు ఆదరా బాదరాగా చేతిలో మాగజైన్ల కట్టతో రైలు వెంట పరుగెత్తుతూ, ఆ కంపార్ట్మెంటు దాకా వచ్చి, తలుపు కమ్మీ పట్టుకొని, "ఎక్స్క్యూజ్ మీ," అంటూ ఇంచుమించు వసంతని తోసుకుంటూ లోపలికి ప్రవేశించాడు.

వసంత కింది పెదవి కొరికి అతనివైపు చూసింది.

"ఎక్స్క్యూజ్ మీ మేడం, ఇన్ని మేగజైన్లు, పుస్తకాలూ కొన్నానా, వంద రూపాయల నోటు యిస్తే చిల్లర లేదంటాడే. బుకింగ్ ఆఫీస్ కి పరిగెత్తితే అక్కడ ఒకటే రష్. తల ప్రాణం తోకకి వచ్చింది. ఒక్క నిమిషం ఆలస్యమైతే రైలు తప్పేదే. మై గాడ్, పెట్టె కూడా లోపలే ఉండి పోయింది."

ఆ ఆగంతుకుడు అనర్గళంగా ఓ చిన్న క్షమాపణ ఉపన్యాసం యిచ్చి బెర్తు మీద మేగజైన్లు, పుస్తకాలు పడేసి, నీలిరంగు సూట్ కేస్ తెరిచి కరెన్సీనోట్లు పెట్టె అడుగున కుక్కాడు.

వసంత నోట మాటలేక అలాగే చూడసాగింది.

"ఎక్స్క్యూజ్ మీ సార్, మీ భార్య అనుకుంటాను. వెరీసారీ, కైండ్లీ పార్డన్ మీ" అన్నాడు ఆ యువకుడు శంకర్ వైపు దీనంగాచూసి.

వసంత తెలివి తెచ్చుకొంది. చప్పున శంకర్ చేతిలోని పుస్తకం లాక్కుని ఆ ఆగంతకునివైపు నడిచి, అతని కా పుస్తకం అందించింది.

"మీరూ క్షమించాలి. అనుమతి లేకుండా మీ పుస్తకం తీశాను."

"ఓ. మరేం పర్వాలేదు." అంటూ పుస్తకం తీసుకుని అతను చప్పున పేజీలు తిరగేసి ఫోటోలు చూసుకుని, చిరునవ్వుతో పుస్తకం పెట్టెలో పెట్టేశాడు.

వసంత శంకర్ వైపు చూసింది. అతనూ ఆమె వైపు చూశాడు. ఇద్దరూ కళ్ళు దించుకున్నారు.

"ఎక్కడిదాకా వెడుతున్నారు?" అతను అడిగాడు.

శంకర్ సమాధానంచెప్పలేదు. వసంత అతని విషణ్ణవదనంలోకి చూసింది. అతను చాటుగా ఆమె కళ్ళలోకి చూశాడు.

ఇదిగో శంకర్, నీ వసంత.

ఇదుగో వసంతా నీ శంకర్.

చూసుకో శంకర్, నీ జేబులో రెండు టిక్కెట్లు ఉన్నాయి. *